

మైనార్టీ గురుకుల పాఠశాల ప్రవేశానికి దరఖాస్తులు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: ఈ విద్యా సంవత్సరం జిల్లాలోని మైనారిటీ గురుకుల పాఠశాల ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి చిన్నారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదవ తరగతి నుండి 8వ తరగతి వరకు మైనార్టీ బాలికలు ప్రవేశ పరీక్ష లేకుండా నేరుగా చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని ముస్లిం క్రిస్టియన్, సిక్కు, పార్సికులు, బౌద్ధ, జైన మతస్తుల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు ఉచిత వసతి భోజన సదుపాయం, యూనిఫారం, నోటు పుస్తకాలు, కాస్మోటిక్ చార్జీలు వైద్య సౌకర్యం లాంటి వసతులను కల్పించనున్నట్లు తెలిపారు. వివరాల కోసం 94411 55061 నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.

24 నుండి టెన్త్ సప్లిమెంటరీ

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: ఈనెల 24వ తేదీ నుంచి టెన్త్ సప్లమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు ప్రభుత్వ పరీక్షల విభాగపు అధికారి దేవానంద రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 2006మంది విద్యార్థులు 15 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు హాజరుకానున్నట్లు తెలిపారు. టెన్త్ సప్లమెంటరీ పరీక్షలు ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:45గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణ కోసం చీఫ్ సూపరింటెండెంట్‌లు, డిపార్ట్మెంటల్ అధికారులు, ఇన్విజిలేటర్లను నియమించడం జరిగిందన్నారు. అలాగే ఎస్ఎస్‌సీ ఇంటర్మీడియట్ సార్వత్రిక పాఠశాలల సప్లమెంటరీ పరీక్షలు జూన్ నెల ఒకటో తేదీ నుండి 8వ తేదీ వరకు మధ్యాహ్నం రెండున్నర గంటల నుండి సాయంత్రం ఐదున్నర గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం సంచాలకులు నాగేశ్వరరావు తెలిపారు. ఈ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 1561మంది విద్యార్థులు 9 పరీక్ష కేంద్రాల్లో సార్వత్రిక పాఠశాల సప్లమెంటరీ పరీక్షలకు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. అన్ని పరీక్షలకు అవసరమైన చీఫ్ సూపరింటెండెంట్‌లు సిబ్బందిని నియమించడం జరిగిందని పేర్కొన్నారు.

దోమల నివారణకు
ఫ్రైడే డ్రైడే పాటించండి: డీఎంహెచ్‌వో

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ప్రభావతి దేవి ఆధ్వర్యంలో శుక్రవారం చిత్తూరు నగర పరిధిలోని శంకరయ్య కుంటలో జిల్లా మలేరియా అధికారి శ్రీనివాసులు ఫ్రైడే డ్రైడేపై విస్తృత తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దోమ కాటు ద్వారా వచ్చే డెంగీ, చికున్ గున్యా, జికా వైరస్, మలేరియా, బోదకాలు, మెదడువాపు వ్యాధి మొదలగు జ్వరాలు వస్తాయన్నారు. ఇవి రాకుండా ఉండాలంటే ఇంటి పరిసరాలు నీటి నిల్వ లేకుండా, మూత ఉన్న డ్రమ్ములలో మాత్రమే నీటిని నిల్వ చేసుకుని, ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని, తద్వారా దోమ పెరుగుదలను నివారించవచ్చని, కొన్ని బయట పుట్టిన దోమలు కుట్టకుండా ఉండడానికి దోమ తెరలు వాడుకోవాలని, సాయంత్రం వేళల్లో వేపాకు పొగ వేసుకోవాలని, పిల్లలకు శరీరం పూర్తిగా కప్పి ఉంచే బట్టలు వేయాలని, కిటికీలకు మెస్‌లు కొట్టుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో గుణశేఖర్, జయరాముడు, నారాయణ, అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.



తనిఖీలు చేపడుతున్న డీఎంహెచ్‌వో ప్రభావతి దేవి



గతేడాది అతివృష్టి కారణంగా నీటి మునిగిన వేరుశనగ పంట



ఈ క్రాప్ బుకింగ్ చేస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

అన్నదాతకు విత్తన భారం

- ఖరీఫ్‌లో బస్తాపై రూ.36 పెంపు
- రూ. 50లక్షల అదనపు భారం

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: ఈ ఏడాది ఖరీఫ్ రైతులపై విత్తన భారం రూ.50లక్షలు పడనుంది. గతేడాది 30కిలోల వెరుశనగ కాయల బస్తా ధర రూ.1,674 విక్రయించగా ఈ ఏడాది బస్తా రూ.1,710గా నిర్ణయించారు. ఈ లెక్కన బస్తాపై రూ.36 పెరిగింది. జిల్లా వ్యాప్తంగా రూ.50లక్షలు విత్తన కాయల భారం జిల్లా ఖరీఫ్ రైతుపై పడనుంది. రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆదేశాల మేరకు జిల్లాకు 42వేల క్వింటాళ్ల విత్తన కాయలు కేటాయించారు. విత్తన కాయలను సరఫరా బాధ్యత ఏపీ విత్తన సంస్థకు అప్పగించారు. ఈ ఏడాది ఖరీఫ్ రైతులకు సరఫరా చేసేందుకు 38వేల క్వింటాళ్ల వేరుశనగ కాయలు వ్యవసాయశాఖ గోడౌన్‌లకు చేరిన్నట్లు వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. ఒక క్వింటా ధర రూ.9,500 కాగా ఇందులో రాయితీ రూ.3,800 అంటే 40శాతం పోను రైతు వాటా రూ.5,700 చెల్లించాలి. ఈ లెక్కన 30కిలోల బస్తా ధర రూ.1,710 కానుంది. విత్తన కాయలను పంపిణీ మే చివరి వారం నుంచి పంపిణీ చేసేందుకు వ్యవసాయశాఖ ఏర్పాట్లు చేస్తోంది.

గతేది జిల్లాలో ఖరీఫ్ వేరుశనగ సాగు సాదారణ విస్తీర్ణం 1,97,694హెక్టార్లు కాగా 74,894 హెకార్టు సాగుచేశారు. అలాగే గతేది 79,541 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు ఆర్‌బికె కేంద్రాల ద్వారా ఖరీఫ్ రైతులకు సబ్సిడీ ధరకు అందజేశారు. గతేది కంటే ఈ ఏడాది 30కిలోలో వెరుశనగ కాయల బస్తాపై రూ.36 పెంచడంతో రైతులపై 50లక్షల భారం పడనుంది. ఏడా అతివృష్టి, అనావృష్టి కారణాలతో ఖరీప్ రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ ఏడాది విత్తన కాయాల ధర పెంపుతో ఖరీప్ సాగుపై ఏ మేరకు రైతులు ఆసక్తి చూపుతారనేది వేచి చూడాలి. సాగు ఖర్చులకు కూడా రాక అల్లాడుతున్న వేరుశనగ రైతులు జిల్లాలో వేరుశనగ సాగు మానేశారు. ఫలితంగా ఏటా సాగు విస్తీర్ణం తగ్గుతోంది. గతేది ఖరీప్ రైతులు ఆశించిన మేర పంట చేతికందక నిలువునా మునిగిపోయారు. సాగు ఖర్చులు కూడా రావడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఏడాది కూడా నైరుతీ రుతుపవణాలు పలకరించకపోవడంతో జిల్లాలో ఎక్కడా ఖరీప్ వేరుశనగ సాగుకు దుక్కిలు దున్నే పరిస్థితి లేదు. ఈ క్రాప్ బుక్ చేసుకున్న రైతులకు వారీ ఖాతాల్లో పూర్తి స్థాయిలో డబ్బులు జమకాలేదు. ఈ ఏడాది విత్తన కాయల ధర పెంపు, ఖరీప్ సీజన్ జూన్ మాసం నుండీ ప్రారంభం కానున్నా.. వర్ష సూచనలు కపించకపోవడంతో గతేది ఖరీప్ సాగు విస్తార్ణం కంటే ఈ ఏడాది తగ్గే అవకాశాలు కనిపిస్తున్నాయి.

నాణ్యతా లోపాలు..

గతేది రాయితీ వేరుశనగ విత్తనకాయలు నాసిరకంగా ఉన్నాయంటూ రైతులు జిల్లాలోని అనేక విత్తన పంపిణీ కేంద్రాల వద్ద ఆందోళన చేపట్టారు. గ్రామీణ విత్తనోత్పత్తి పథకం ద్వారా సేకరించిన విత్తన కాయలు కాకుండా ఏపీ సీడ్స్ వేరుశనగ విత్తన కాయలు మార్కెట్ ధరకు కొనుగోలు చేసి నాణ్యత లేని కాయలను సరఫరా చేశారంటూ రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఏడాదైనా గతేదిలా కాకుండా నాణ్యమైన వెరుశనగ విత్తనకాయలను సరఫరా చేయాలని రైతు సంఘాల నేతలు, రైతులు కోరుతున్నారు. అలాగే రైతులపై పడనున్న రూ.50లక్షల భారాన్ని ప్రభుత్వంమే భరించాలని కోరుతున్నారు. గతేది పంట నష్టపోయిన రైతుల్లో ఈ క్రాప్ బుకింగ్ చేసుకున్న వారికి నష్టపరిహారం చెల్లించాలని ఖరీప్ రైతులు సాగు ఖర్చుల కోసం ఋణాలు అందించాలని కోరుతున్నారు.



ఆర్‌బికే కేంద్రాల్లో పంపిణీ చేస్తున్న రాయితీ విత్తన కాయలు (ఫైల్‌ఫోటో)

తూర్పు కనుమల్లో అరుదైన కప్ప



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

తూర్పు కనుమ పలమనేరు కౌండిన్య అటవీ ప్రాంతం గౌనితిమ్మపల్లి వద్ద ఓ కుంటలో రెండు శతాబ్దాల క్రితం కనుమరుగైన శ్రీలంక గోల్డెన్ బ్యాక్డ్ ఫ్రాగ్ (శాస్త్రీయ నామం హైలా రానా (గ్రాసిలిస్) అనే ఉభయచర జీవిని జూలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, ఆంధ్రప్రదేశ్ బయోడైవర్సిటీ బోర్డ్ కు చెందిన పరిశోధకులు ఈ కప్పను కనుగొన్నారు. ఈ కప్ప 1829 శ్రీలంకలో సాధారణ కప్పగా నమోదు చేయబడి ఉందని పరిశోధకులు తెలిపారు. తూర్పు కనుమల ప్రాంతంలో 27 ఉభయచరాలు ప్రస్తుతానికి కనుగొన్నామని, పశ్చిమ కనుమల్లో 253, భారతదేశంలో 454 ఉభయచరాలలో పోల్చి చూసామన్నారు. భారత ఉపఖండం నుండి ఇప్పటివరకు 19 గోల్డెన్ బ్యాక్ ఫ్రాగ్ లను గుర్తించబడ్డాయన్నారు. హైదరాబాదులోని జూలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా శాస్త్రవేత్తలు డాక్టర్ దీప, జైస్వాల్, డాక్టర్ ఎస్ ఎస్ జాదవ్, డాక్టర్ కరుతపాండి, ఆంధ్రప్రదేశ్ బయోడైవర్సిటీ బోర్డ్ పరిశోధకురాలు కళ్యాణి కుంటే, పూణేలోని జూలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా పరిశోధకులు కేపీ దినేష్ ల ప్రయత్నమే శ్రీలంక గోల్డెన్ బ్యాక్డ్ ఫ్రాగ్ మళ్లీ పునరావిష్కరణ జరిగిందన్నారు.

విమానం ఎక్కిన పేదింటి విద్యా కుసుమాలు

చెన్నయ్-హైదరాబాద్ విహారయాత్ర

ప్రజాశక్తి - సత్యవేడు

ప్రభుత్వ స్కూళ్లను ప్రోత్సహించడం తనవంతు బాధ్యతగా అనుకున్నారు సురుటుపల్లి ఆలయ ట్రస్ట్ బోర్డు మెంబర్ ఉమాపతి. మాదనంపాలెం ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతిలో 500 కంటే ఎక్కువ మార్కులు వచ్చిన వారికి తన డబ్బులతో విమానం ఎక్కే అవకాశం కల్పిస్తానని ప్రకటించారు. హామీ మేరకు శుక్రవారం చెన్నయ్ నుంచి హైదరాబాద్‌కు నలుగురు విద్యార్థులను హెడ్‌మాస్టర్‌ను తోడుగా పంపారు. రెండు రోజుల పాటు హైదరాబాద్‌లో విహారయాత్ర చేసి ఆ పేదింటి విద్యా కుసుమాలు తిరిగి మాదనపాలెంకు రానున్నారు. విమానం కోరిక ఆ విద్యార్థుల దృష్టిలో చాలా పెద్దది.. అయితే సంకల్పంతో మంచి మార్కులు తెచ్చుకున్న ఆ విద్యార్థులకు ఉమాపతి మంచితనంతో కల నెరవేరింది.

సత్యవేడు మండలం చెరివి పంచాయతీ మాదన పాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు విమాన ప్రయాణం ద్వారా విహారయాత్రలకు పంపుతానని ఉమాపతి హామీ ఇచ్చారు. ఆ మాట ప్రకారం మంచి మార్కులు సాధించిన విద్యార్థులు శుక్రవారం చెన్నై నుంచి హైదరాబాదుకు విమానం ఎక్కారు.

రెండు రోజులపాటు అక్కడే..



మాదన పాలెం ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో 500 కంటే ఎక్కువ మార్కులు సాధించిన పురుషోత్తం(552), వి. విష్ణు (515), మహా (509), తనుజ (505) లతోపాటు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ముని మోహన్ చెన్నై విమానాశ్రయం నుంచి విమానంలో శుక్రవారం మధ్యాహ్నం హైదరాబాదుకు చేరుకున్నారు. అక్కడ రెండు రోజులు పాటు వివిధ విద్యా సంస్థల విద్యా విధానాలను అధ్యయనం చేసి, విహార ప్రాంతాలను సందర్శించి తిరిగి తిరుపతికి చేరుకోనున్నారు. ఈ విహారయాత్రకు అయ్యే ఖర్చులను మాదనపాలెం కు చెందిన సురుటుపల్లి ఆలయ ట్రస్ట్ బోర్డు మెంబర్ ఉమాపతి పూర్తిగా భరిస్తున్నారు.. ఇచ్చిన మాట ప్రకారం పదో తరగతిలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు ఉల్లాసాన్ని విజ్ఞానాన్ని అందించి ప్రోత్సహించిన ఉమాపతి ప్రోత్సాహక తీరు ఇతరులకు ఆదర్శనీయంగా ఉందని స్థానికులు, ఉపాధ్యాయులు వెల్లడించారు.

వ(హా)ర్షం..!

జిల్లావ్యాప్తంగా రైతుల్లో ఆనందం
నాట్లు వేసుకునేవారికి మంచిది
రెండోకారు పంటకూ ఉపయోగం

ప్రజాశక్తి - యంత్రాంగం

తిరుపతి, చిత్తూరు జిల్లాల వ్యాప్తంగా గురు, శుక్రవారాల్లో వర్షం పడింది. మే నెల మొదటి పక్షంలో ఎండలు ఠారెత్తించాయి. పోలింగ్ రోజునా ఓటర్లు మండుటెండలో అల్లాడిపోయారు. రెండు మూడు రోజులుగా వాతావరణం చల్లబడి, అక్కడక్కడ వర్షాలు పడుతున్నాయి. ఆకాశం మేఘావృతమై ఆహ్లాదంగా కనిపించింది. తిరుపతి జిల్లా తూర్పు మండలాల్లో ఇప్పటికే నాట్లు నాటుతున్న రైతులకు ఈ వర్షం ఉపయోగకరంగా ఉంటుందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. రెండో కారుగా వేరుశనగ వేసిన వారికి మంచిదేనని తెలిపారు. తిరుపతి, తిరుమల, శ్రీకాళహస్తి, వెంకటగిరి నియోజకవర్గాల్లో పెద్దఎత్తున వర్షం కురిసింది.

డక్కిలి.. వెంకటగిరి, డక్కిలి సహా పరిసర ప్రాంతాల్లో శుక్రవారం అక్కడక్కడ వర్షం కురిసింది. ఉదయమంతా ఎండ తీవ్రత ఎక్కువగా ఉంది, సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. సాగునీటి ఇబ్బంది ఎదుర్కొంటున్న నిమ్మ, మామిడి పండ్ల తోటలకు వర్షం ఊరటనిచ్చింది.

వెంకటగిరి రూరల్ : వరి సాగుకు సాగునీటి కోసం ఎదురుచూస్తున్న తరుణంలో మండల ప్రాంతాల్లో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. రబీ పంట కోసిన అనంతరం కొంతమంది రైతులు సాగునీరు అనుకూలంగా ఉండే రెండో దఫా వరి పంటలు (1010) రకాలు వేయడానికి సన్నద్ధమవుతున్న తరుణంలో ఈ వర్షం ఎంతో ఓదార్పుగా నిలిచింది.



తిరుమలలో వర్షంలో భక్తులు

కమాండ్ కంట్రోల్ రూమ్ పరిశీలన

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: ఎస్‌విసెట్ కళాశాలలో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాట్లును జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, ఎస్పీ మణికంఠ చందోలు పరిశీలించారు. శుక్రవారం డిఆర్‌ఓ బి.పుల్లయ్య, ఆర్డీఓ చిత్తూరు, పూతలపట్టు అసెంబ్లీ నియోజకవర్గం రిటన్నింగ్ అధికారి జి.చిన్నయ్యలతో కలసి ఓట్లు లెక్కింపు కేంద్రాలకు సంబంధించి ఏర్పాటు చేస్తున్న కమాండ్ కంట్రోల్ రూమ్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐడి కార్డు, ప్రొసీడింగ్ కాఫీ ఉంటేనే ఎస్‌వి సెట్ కళాశాలలోనికి అనుమతించాలని పోలీసు అధికారులకు సూచించారు. సార్వత్రిక ఎన్నికలలో భాగంగామ చిత్తూరు జిల్లాలో ఒక పార్లమెంటరీ నియోజకవర్గం, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు ఈ నెల 13న జరిగిన ఎన్నికల ఓట్లు లెక్కింపు జూన్ నెల 4న ఎస్‌వి సెట్‌లో ఓట్లు లెక్కింపు కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సీసీ కెమెరాలు అభ్యర్థులు, పార్టీల ఏజెంట్లుకు అవసరమైన సీటింగ్ ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కమాండ్ కంట్రోల్ రూమ్‌లో 7నియోజకవర్గాలకు సంబంధించి 7టీవిలు ఏర్పాటు చేయడం జరిగిందని, నియోజకవర్గానికి ఒక్క టివి ఏర్పాటు చేయడంతో కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి స్ట్రాంగ్ రూమ్స్‌ను పరిశీలించుకోవచ్చునని, జూన్ 4న ఓట్లు లెక్కింపు ప్రక్రియను కంట్రోల్ రూమ్ పరిశీలించుకోవచ్చునని తెలిపారు. రాజకీయ పార్టీలకు సంబంధించి



అభ్యర్థులు లేదా ఏజెంట్లు కంట్రోల్ రూమ్‌కు వచ్చినప్పుడు వారి నుంచి సంతకాలు తీసుకోవాలని, కంట్రోల్ రూమ్‌లో మూడు షిఫ్టులుగా విధులు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని, వారికి ఐడి కార్డులు ఇవ్వాలని కలెక్టరేట్ ఏఓను ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎస్పీ అరిపుల్లా, కమ్యూనికేషన్ మేనేజ్మెంట్ నోడల్ ఆఫీసర్ నరసింహులు, ఏఆర్‌ఓలు శ్రీనివాసులు రెడ్డి, విజయలక్ష్మి, విద్యుత్, ఆర్అండ్‌బీ వివిధ శాఖలధికారులు, ఎమ్మెల్యే అభ్యర్థులు, రాజకీయ పార్టీల ఏజెంట్లు తదితరులు పాల్గొన్నారు.

కూటమికి 125-150 సీట్లు

శ్రీవారి సేవలో రఘురామకృష్ణంరాజు

ప్రజాశక్తి - తిరుమల

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు రావాలని కోరుకున్నానని, కూటమికి 125-150 సీట్లు తప్పకుండా వస్తాయని ఎంపి రఘురామకృష్ణంరాజు వ్యాఖ్యానించారు. గురువారం చంద్రగిరి టిడిపి అభ్యర్థి పులివర్తి నానిని పరామర్శించిన ఆయన, శుక్రవారం తెల్లవారుజామున శ్రీవారిని దర్శించుకున్నారు. శ్రీవారి అభిషేక సేవలో పాల్గొన్నారు. అర్చకులు శ్రీవారి తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం ఆలయం వెలుపల రఘురామకృష్ణం రాజు వైసిపి 25-40 సీట్లకే పరిమితమవుతుందన్నారు. తన మాట నిజం అవుతుందో, జగన్ మాట నిజమవుతుందో జూన్ 4న తెలుస్తుందన్నారు. ఆంధ్ర రాష్ట్రానికి మంచి రోజులు రావాలని తాను శ్రీవారిని వేడుకున్నట్లు చెప్పారు.

తోటి వేషాల్లో గంగమ్మ భక్తులు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: తిరుపతి తాతయ్య గుంట గంగమ్మ జాతర మూడో రోజైన శుక్రవారం తోటి వేషాలతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. మే నెల వేసవి సెలవులు కావడంతో ఇటు చిన్న పిల్లలు, పెద్దలు తోటి వేషాలు వేసి నగరంలో పలుచోట్ల ప్రదర్శన నిర్వహించారు. ముఖ్యంగా రాజకీయ పార్టీ నేతలు తోటి వేషాలు వేయడంతో పాటు అమ్మవారిని దర్శించుకున్నారు భక్తులు తమ శరీరానికి బొగ్గును పూసుకుని, వేప ఆకులతో చేసిన దండను ధరిస్తారు. జాతర సందర్భంగా ఆలయం వద్ద ప్రత్యేక ఏర్పాట్లను చేపట్టారు.

బెంచీలు వితరణ



బేంచీలు ఏర్పాటు చేస్తున్న స్వచ్ఛంద సంస్థ సభ్యులు

ప్రజాశక్తి-పుంగనూరు: పట్టణంలోని ప్రధాన కూడలిలో మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా బెంచీలను వితరణ చేశారు. ప్రధాన కూడలిలో, ప్రభుత్వ కార్యాలయాల వద్ద బెంచీలను శుక్రవారం ఏర్పాటు చేశారు. పుంగనూరు సబ్ రిజిస్టర్ కార్యాలయ ఆవరణం, ప్రధాన కూడలి బస్‌స్టాప్ వద్ద మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా ఉచితంగా బెంచీలు ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. సుమారు 50 సిమెంటు బెంచీలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పూల త్యాగరాజు, నానబాల గణేష్, రోటరీ క్లబ్ కార్యదర్శి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

▶▶ వైద్యాధికారి ప్రదీప్ కుమార్ రెడ్డి



ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో వైద్య సిబ్బంది

ప్రజాశక్తి-సోమల: గ్రామాలలో నివాసాల చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని సోమల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ప్రదీప్‌కుమార్ రెడ్డి అన్నారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా నంజంపేట గ్రామంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ప్రజలకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం మురికి కాలువలలో, ఇండ్లలో ఉండే నీటి తొట్టెలలో ఆబెట్ మందును వేసి లార్వాలు లేకుండా చూసుకోవాలని గృహ యజమానులకు సూచించారు. దోమలు ప్రబలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ సాయంత్రం వేళల్లో ఇంటిలో వేపాకు పొగ వేసుకొని దోమలు రాకుండా నియంత్రించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సిహెచ్‌ఓ అమర్నాథ్, వైద్య సిబ్బంది ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

శాంతికి భంగం కలిగిస్తే చర్యలు: ఎస్ఐ



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ

ప్రజాశక్తి-సోమల: ప్రశాంత పల్లెల్లో శాంతికి భంగం కలిగిస్తే ఎంతటివారినైనా ఉపేక్షించబోమని ఎస్ఐ వెంకట నరసింహులు హెచ్చరించారు. కవ్వింపు చర్యలు, గొడవలు, ఘర్షణలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరించనున్నట్లు స్పష్టం చేశారు. శుక్రవారం మండలంలోని కందూరు, ఆవులపల్లి గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా అక్కడి గ్రామస్తులకు పలు సూచనలు చేశారు. ఎన్నికల ఫలితాలు వెలువడేంతవరకూ 144సెక్షన్, పోలీస్ 30యాక్ట్ అమల్లో ఉందని, నిబంధలను అతిక్రమిస్తే కఠినమైన కేసులు మోపడం జరుగుతుందని తేల్చిచెప్పారు. చట్టాన్ని ఉల్లంఘించిన వారు తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. అనంతరం ఆవుల పల్లెలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు.

20న ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-చిత్తూరుడెస్క్: ఈనెల 20న ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. చౌడేపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించే శిబిరానికి చెన్నై నుంచి కంటి శస్త్ర చికిత్స వైద్య నైపుణలు రానున్నట్లు పేర్కొన్నారు. కంటి సమస్యలు ఉన్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

రేపటి నుంచి బూరగమందలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి-సదుం: మండల పరిధిలోని బూరగమందలో టీటీడీ పరిధిలో వున్న శ్రీదేవి, బూదేవి సమేత శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 19 నుంచి వార్షి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. శుక్రవారం ఆలయ అధికారులు మాట్లాడుతూ 19 నుంచి 28వ తేది వరకు బ్రహ్మోత్సవాలు జరగనున్నట్లు వివరించారు. 19న ధ్వజారోహణం, 23న కళ్యాణోత్సవం, గరుడ వాహనం, 24న పుష్పపల్లకి, 27న చక్ర స్నానం, 28న పుష్ప యాగం తదితర కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తున్నామని ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు కరపత్రాలు పంపిణీ చేశారు.

వృద్ధులకు అన్నదానం



అన్నదానం చేపడుతున్న శ్రీరాములు కుటుంబ సభ్యులు

ప్రజాశక్తి-కార్వేటినగరం: మండల కేంద్రంలో రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమంలోని వృద్ధులకు జిల్లా విద్యాశిక్షణా (డైట్)లో జూనియర్ అసిస్టెంట్గా విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మృతి చెందిన వై.శ్రీరాములు మొదటి వర్ధంతిని పురస్కరించుకుని ఆయన జ్ఞాపకార్థం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరాములు భార్య వై.రాజేశ్వరీ మాట్లాడుతూ డైట్ కళాశాలలో జూనియర్ అసిస్టెంటుగా ఉత్తమ సేవలు అందించి అధికారుల వద్ద, ఇటు కార్వేటినగరం గ్రామస్తుల వద్ద పేరు ప్రతిష్టలు సంపాధించుకున్నారని ఆయన మృతి వారి కుటుంబానికి తీరనిలోటన్నారు. ఆయన జ్ఞాపకార్థం ప్రతి ఏడాది వృద్ధులు సేవా కార్యక్రమాలు అందిస్తామన్నారు. ఈ క్రమంలో వృద్ధులకు పళ్లు, స్వీట్లు, మధ్యాహ్నం అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో శ్రీరాములు కుమారుడు నవీన్, కుమార్తెలు లోకి. హర్ష, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఇంటర్మీడియట్ అడ్మిషన్లు ప్రారంభం



పాఠశాల అప్‌గ్రేడ్ కాపీలను చూపుతున్న ప్రధానోపాధ్యాయులు

ప్రజాశక్తి-చిత్తూరు డెస్క్: యదమరి మండల కేంద్రంలో పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హైస్కూల్ ప్లస్‌గా ఈ సంవత్సరం నుండి అప్‌గ్రేడ్ అయింది. ఈ ఏడాధి నుంచి పాఠశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం కోసం అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని పాఠశాల ప్రధానోపాధ్యాయులు గిరి రాజా, విద్యా కమిటీ ఛైర్మన్ రాజారెడ్డిలు తెలిపారు. ఈ సంవత్సరం పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఇంటర్మీడియట్ ఫస్టియర్, ఎంపీసీ, బైపిసిలో అడ్మిషన్ కొరకు పాఠశాల కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

శ్మశాన స్థలం కబ్జా

▶▶ అధికారులు చర్యలు తీసుకోవాలని వేడుకోలు



జేసీబీతో చదును చేసిన శ్మశానవాటిక స్థలం

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండలంలోని కమ్మనపల్లి శ్మశాన వాటికను కొంతమంది కబ్జా చేశారని ఆ గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. కమ్మనపల్లి గ్రామ రెవెన్యూ లెక్క దాఖలాలో సర్వే నంబర్ 212లో ప్రభుత్వం శ్మశాన వాటికకు కేటాయించింది. కమ్మనపల్లి, జలారిపల్లి గ్రామాలలో ఉంటున్న యాదవులు 35కుటుంబాలకు సంబంధించిన ఆ శ్మశాన వాటిక స్థలంలో కొంతమంది దౌర్జన్యంగా జేసీబీతో చదును చేశారని ఆ గ్రామస్తులు వాపోయారు. కమ్మనపల్లికి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ మునివేంకటప్ప అతని కుమారులు బాలకృష్ణ, తులసి జెసిపి సహాయంతో శ్మశాన స్థలాన్ని చదును చేశారని, ఏళ్లనాటి నుంచి తమ ఆదీనంలో ఉన్న స్థలాన్ని కబ్జా చేయడం దారుణమని గ్రామస్తులు మండిపడ్డారు. ఆ స్థలంలోని వృక్ష్యాలను సైతం తొలగించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి ఆక్రమణదారులపై తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వేరుశనగ విత్తనాల పంపిణీకి ఏర్పాట్లు



వేరుశనగ నిల్వలను పరిశీలిస్తున్న ఏడీ శివకుమార్ రాజు

ప్రజాశక్తి-పుంగనూరు: పుంగనూరు డివిజన్ వ్యవసాయ శాఖ పరిధిలో రాయితీపై వేరుశనగ విత్తనాల పంపిణీకి ఏర్పాటు చేయడం జరిగిందని ఏడి శివకుమార్ రాజు శుక్రవారం తెలిపారు. డివిజన్ పరిధిలోని 118 రైతు భరోసా కేంద్రాలలో 2024ఏడాది ఖరీఫ్ సీజన్‌కు కావాల్సిన వేరుశెనగ కాయలు నిల్వ చేయడం జరిగిందన్నారు. డివిజన్ పరిధిలోని 111రైతు భరోసా కేంద్రాలకు 10,444క్వింటాళ్లు వేరుశెనగ బస్తాలు పంపడం జరుగుతుందని వివరించారు. 5-6రోజుల్లో అన్ని ఆర్‌బికేలకు విత్తనం నిల్వ చేయడం జరుగుతుందన్నారు. పుంగనూరు మండలంకు-1950 క్వింటాళ్లు, చౌడేపల్లి మండలంకు-1350 క్వింటాళ్లు, పెద్దపంజాణి మండలంకు-1745క్వింటాళ్లు, గంగవరం మండలానికి-1222, సోమల మండలంకు 1088, సదుం మండలానికి-890, రొంపిచర్ల మండలానికి1100, పులిచెర్ల మండలానికి1099క్వింటాళ్లు చొప్పున పంపిణీకి సిద్ధంగా ఉంచినట్లు చెప్పారు. జిల్లా యంత్రాంగం నుంచి ఆదేశాలు అందిన వెంటనే వేరుశనగ విత్తనాలను పంపిణీ చేస్తామన్నారు. ఆధార్ బయోమెట్రిక్ ప్రమాణీకరణ ఆధారంగా పంపిణీ జరుగుతుందని స్పష్టం చేశారు. 40శాతం రాయితీ ద్వారా కె -6రకం వేరుశనగ విత్తనాలు కిలో రూ.57, నారాయణి రకం కిలో రూ.58.20 ధరతో రైతులకు అందించడం జరుగుతుందన్నారు. పంపిణీ షెడ్యూల్‌ను సంబంధిత మండల వ్యవసాయ అధికారులకు ఇవ్వనున్నట్లు చెప్పారు.

రక్తపోటును నియంత్రించండి

❖ ఎక్కువ కాలం జీవించండి

❖ డిఎంహెచ్‌వో ప్రభావతి దేవి



ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: రక్తపోటును నియంత్రించి ఎక్కువ కాలం జీవించాలని డీఎంహెచ్‌వో ప్రభావతి దేవి సూచించారు. శుక్రవారం చిత్తూరు నగర పరిధిలోని కాజూరు అర్బన్ హెల్త్ సెంటర్‌లో "ప్రపంచ హైపర్ టెన్షన్ దినోత్సవం" సమావేశం, ర్యాలీ, ప్రతిజ్ఞ నిర్వహించారు. డాక్టర్ ప్రభావతి దేవి మాట్లాడుతూ "మీ రక్తపోటును కచ్చితంగా కొలవండి, నియంత్రించండి, ఎక్కువకాలం జీవించండి" అనే నినాదంతో ప్రజల ముందుకు వెళ్లడం జరుగుతుందన్నారు. రక్తపోటునే సైలెంట్ కిల్లర్ వ్యాధి అని కూడా అంటారు. ఇది రెండు రకాలు: అధిక రక్తపోటు, తక్కువ రక్తపోటు. ఇందులో ఏది ఉన్న జీవితాంతం మందులు వాడాల్సి ఉంటుందని పేర్కొన్నారు. లక్షణాల గురించి వివరించారు. ఊబకాయలకు, ఎక్కువ మాంసాహారం తినేవారికి, వంశపారంపర్యంగా, బీడీ సిగరెట్ ఆల్కహాల్ తీసుకునే వారికి, విపరీతమైన చెడు ఆలోచనలు చేసే వారికి, శారీరక శ్రమ లేని వారికి వస్తుందన్నారు. పై వాటిని నిర్మూలించి ఆరోగ్యకర ఆహారంతో, జీవనశైలితో, చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ, ప్రతిరోజు శారీరక శ్రమ చేస్తూ నడక యోగా ధ్యానం లాంటివి, మనసు ప్రశాంతంగా, హాయిగా, సంతోషంగా, తృప్తిగా ఉంచుకున్నట్లయితే రక్తపోటు రాదన్నారు. సాధారణంగా రక్తపోటు 120/80ఎంసిజి ఉండాలి, దానికన్నా పెరిగితే అధిక రక్తపోటు అని తగ్గితే తక్కువ రక్తపోటని చెబుతారన్నారు. ఒకసారి వస్తే జీవితాంతం తప్పక డాక్టర్ పర్యవేక్షణలో మందులు వాడాల్సి ఉంటుందని అలా లేనిపక్షంలో పక్షవాతం, గుండె జబ్బులకు, మూత్రపిండాల వ్యాధికి గురై సీరియస్ కావడం జరుగుతుందని తెలిపారు. పై సూచనలను ఎవరైతే పాటిస్తారో మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకట ప్రసాద్, జిల్లా మలేరియా అధికారి శ్రీనివాసులు, ఎపిడీమియాలజిస్ట్ శ్రీవాణి, హెచ్‌ఈఓ గుణశేఖర్, ఇన్‌ఛార్జ్ డెమో జయరాముడు, రాజేంద్రప్రసాద్ స్థానిక సిబ్బంది పాల్గొన్నారు.

సదుం: ప్రపంచ రక్త పోటు దినోత్సవం సందర్భంగా శుక్రవారం చెరుకువారిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ శ్రీ గిరీషా ఆధ్వర్యంలో సదుం బస్టాండ్ కూడలిలో "ప్రపంచ రక్త పోటు దినోత్సవం" పై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు నీలకంఠ, శిఖామణి, హేమ, సరస్వతి, రేవతి, రషీద్, దీప, శ్రావణి, జానకి పాల్గొన్నారు.

చిత్తూరుడెస్క్: రక్తపోటును నివారించుకోవాలని ప్రధాన వైద్యులు శిరీష అన్నారు. శుక్రవారం బంగారుపాళ్యం మండల కేంద్రంలోని ప్రజా ఆరోగ్య వైద్య కేంద్రంలో రక్తపోటు దినోత్సవ కార్యక్రమం జరిగినది. కార్యక్రమంలో వైద్యులు విజయ్‌కుమార్, శాలిని, జ్యోతి స్వరూప, భరత్, అఖిల్, సుమతి, రిజ్వాన్, భార్గవి, రెడ్డి కుమారి, బాబు, శివకుమార్ పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లి: ప్రపంచ రక్తపోటు దినోత్సవ సందర్భంగా మండలంలోని తీర్థం బైరెడ్డిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో డాక్టర్ విజయచంద్ర, డాక్టర్ అరుణకుమార్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. రక్తపోటు నివారణ, ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శాలిని, డాక్టర్ అరుణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్ఆర్ పురం: మండల కేంద్రమైన ఎస్ఆర్ పురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు శుక్రవారం డిస్ట్రిక్ట్ ఇమోనైజేషన్ ఆఫీసర్ డాక్టర్ రవి రాజు ఆధ్వర్యంలో డాక్టర్లు గిరి, సందీప్ రాజ్ ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ రవి రాజు మాట్లాడుతూ.. ప్రజల్లో సరైన అవగాహన లేక రక్తపోటు సమస్యలు ఎక్కువగా ఉన్నాయని అన్నారు. ఈ రక్తపోటును కంట్రోల్ చేయడానికి వ్యాయామము, డైట్ కంట్రోల్ చేయాలని పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సిహెచ్‌ఓ మునస్వామి, ఫార్మసిస్ట్ జగదీష్, లాంటెక్నిసియన్ పద్మజ, స్టాఫ్ నర్సు శ్రీదేవి పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలకు విద్యార్థుల ఎంపిక






ప్రజాశక్తి-సోమల: సోమల మండలం పెద్ద ఉప్పరపల్లి ఎంపీపీ స్కూల్‌లో నాలుగవ తరగతి చదువుతున్న ఐదు మంది విద్యార్థులు ఏపీఆర్ఎస్ ఎంట్రన్స్ పరీక్షలలో అర్హత సాధించి ఐదవ తరగతిలో చేరేందుకు గురుకుల పాఠశాలకు ఎంపిక అయినట్టు ప్రధానోపాధ్యాయులు రమణారెడ్డి తెలిపారు. వి.జాహ్నవి, ఎం.హనీ, ఆర్.తేజశ్రీ కమ్మనపల్లి గురుకుల పాఠశాలకు, డి.గౌతమ్, మోక్షిత్ కుమార్ గ్యారంపల్లి గురుకుల పాఠశాలకు ఎంపికై ఐదవ తరగతిలో చేరనున్నట్లు ఆయన తెలిపారు. విద్యార్థులు గురుకుల పాఠశాలకు ఎంపిక కావడంపై పాఠశాల సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

క్రైం కార్నర్

లారీని ఢీకొని యువకుడి మృతి




సురేష్ మృతదేహం



రోడ్డు మధ్యలో ఆగివున్న లారీ

ప్రజాశక్తి-చిత్తూరుడెస్క్: లారీని ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన శుక్రవారం ఉదయం బంగారుపాళ్యం మండలం మొగిలి ఘాట్ వద్ద చోటు చేసుకుంది. ఏఎస్ఐ వల్లెమ్మ సమాచారం మేరకు.. పలమనేరు పట్టణం పాతపేటకు చెందిన సురేష్ (21) చిత్తూరు నుంచి పలమనేరుకు ద్విచక్ర వాహనంలో బయలుదేరాడు. మొగిలి ఘాటులో నిబంధనలు పాటించకుండా జాతీయ రహదారి మధ్యలో నిలిపిన లారీని వెనుక నుంచి ఢీకొన్నాడు. ఈ ప్రమాద ఘటన చూసిన ఇతర ప్రయాణికులు గాయపడిన సురేష్‌ను చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సురేష్ మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ వల్లెమ్మ తెలిపారు.

నీటి కుంటలో పడి బాలుడు మృతి



చేతన్‌కుమార్ రెడ్డి(ఫైల్)

ప్రజాశక్తి-సోమల: ప్రమాదవశాత్తు నీటి కుంటలో పడి బాలుడు మృతి చెందిన సంఘటన మండలంలోని పేటూరు పంచాయతీ పొలికిమాకులపల్లిలో వెలుగుచూసింది. స్థానికుల కథనం మేరకు..పొలిమాకులపల్లికి చెందిన జయరాంరెడ్డి, మమత దంపతులకు ఇద్దరు కుమారులు. ద్వితీయ కుమారుడు చేతన్‌కుమార్ రెడ్డి(7) శుక్రవారం గ్రామ సమీపంలోని నీటి కుంట వద్దకు బహిర్భూమికని వెళ్లి ప్రమాదవశాత్తు కుంటలో పడి మునిగిపోయి మృతి చెందాడు. బాలుడు మూడవ తరగతి చదువుతున్నట్లు గ్రామస్తులు తెలిపారు. చేతన్‌కుమార్‌రెడ్డి మృతి పట్ల ఆ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.


దారి వదలమన్నందుకు కర్రలతో దాడి



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు వెంకటరెడ్డి

ప్రజాశక్తి-పుంగనూరు: ఇంట్లోంచి బయట వచ్చేందుకు దారి వదలమంటే విచక్షణారహితంగా దాడి చేశారని ఓ బాధితుడు తెలిపారు. వివరాలు ఇలా.. పుంగనూరు మండలం పాలేంపల్లె పంచాయతీ నడిమిగడిదేసి గ్రామంకి చెందిన వెంకటరెడ్డి(30)పై అదే గ్రామానికి చెందిన రాజన్న కుమారులు రెడ్డెప్ప, బాలాజీ, వెంకట్‌రెడ్డిలు కత్తికర్రలతో దాడి చేసినట్లు బాధిత కుటుంబసభ్యులు తెలిపారు. తీవ్ర గాయాలతో స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు వెంకటరెడ్డి తయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటి ప్రభుత్వం ఏర్పాటు చేసిన రోడ్డుపైకి తాము రాకూడదంటూ దౌర్జన్యం చేస్తూ కర్రలతో దాడి చేశారని మీడియా ఎదుట కన్నీరు పెట్టుకున్నారు. ఇదే విధంగా ఇప్పటికే మూడు సార్లు దాడి చేశారని తెలిపారు. ఈ విషయంగా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నాటు బాంబు పేలి శునకానికి గాయాలు



ప్రజాశక్తి-చిత్తూరుడెస్క్: నాటు బాబు పేలి శునకానికి గాయాలైన సంఘటన చౌడేపల్లిలో చోటుచేసుకుంది. రైతు కథనం మేరకు.. మండలంలోని పంచాయితీ కేంద్రం దుర్గ సముద్రంకు చెందిన చెంగారెడ్డికి బుటకపల్లి సమీపంలోని ఆంజనేయ స్వామి గుట్ట వద్ద కొంతమేర పొలం ఉంది. యథా ప్రకారం శుక్రవారం పొలం పనులు చేస్తుండగా తన పెంపుడు శునకం పక్కనే ఉన్న మామిడి తోటలోకి వెళ్ళింది. కొంతసేపటికి పెద్ద శబ్దం రావడంతో వెళ్లి చూడగా అడవి జంతువులకని వేసిన నాటుబంబు పేలి శునకానికి గాయాలయ్యాయి. ఇటీవల కాలంలో పొలాల వద్ద వన్యప్రాణులకు నాటు బాంబులు తీయడం ఈ ప్రాంతంలో పరిపాటి అయ్యిందని రైతుల తెలిపారు. శునకం కాకుండా ఎవరైనా మనుషులు తోటలోకి వెళ్లి ఉంటే ప్రాణ నష్టం జరిగిండేదని వాపోయారు. నాటు బాంబు పేలుడు ఘటనపై పరిసర ప్రాంత రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని వేటగాళ్లపై నిఘా ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు. గాయపడ్డ పెంపుడు శునకాన్ని మదనపల్లి ఆసుపత్రికి తరలించారు.

ఆరంభం.. అంతలోనే ముగింపు

▶▶ సమస్యలు చర్చింకుండా అర్ధాంతరంగా ముగిసిన మండల మీట్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

ప్రజాశక్తి-సోమల: మండల సాధారణ సర్వసభ్య సమావేశాన్ని ఆరగంట ఆలస్యంగా ఆరంభించి 40నిమిషాల పాటు టీ, స్నాక్స్‌తో ముగించారు. శుక్రవారం ఎంపీపీ ఈశ్వరయ్య అధ్యక్షతన ఎంపీడీవో కార్యాలయం వద్ద సమావేశ మందిరంలో సభ్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులు సమావేశమైయ్యారు. 11గంటలకు ప్రారంభించాల్సి ఉండగా అరగంట ఆలస్యంగా 11.30గంటలకు ఆరంభించారు. ఆ తరువాత ఎంపీడీవో నారాయణ నాలుగు మాటలు మాట్లాడి అధికారుల నుంచి అభివృద్ధి ప్రణాళికలపై మాట్లాడేందుకు ప్రయత్నిస్తుండగా సమావేశానికి హాజరైన వారికి స్నాక్స్, టీ అందించడంతో సమావేశంలోని అధికారులు ప్రజాప్రతినిధులు వాటిని తింటూ టీ తాగడానికి 40 నిమిషాలు సమయాన్ని తీసుకున్నారు. మరొక 15నిమిషాలకు ఎంపీడీవో సమావేశాన్ని ముగిస్తున్నట్లు ప్రకటించారు. దీంతో మండల సర్వసభ్య సమావేశానికి వచ్చిన కొద్దిమంది ప్రజాప్రతినిధులు, అధికారులు కుర్చీలలో నుంచి లేచి సమావేశంలో నుండి వెళ్లిపోయారు. ఎన్నికల నియమావళి పేరుతో సమావేశాన్ని ముగిస్తున్నట్లు చెప్పినా కనీస సమస్యలు, సౌకర్యాలు సమావేశంలో ప్రస్తావించకపోవడం ఏంటని పలువురు మాట్లాడుకోవడం వినిపించింది. మండలంలో వరుసగా పంటపొలాల్లో ఏనుగుల దాడులు, భారీగా ఈదుర గాలులతో కురిసిన వార్షానికి నేల రాలిన మామిడి రైతులకు నష్టపరిహారం, గ్రామాల్లో సమస్యలేమీ చర్చించకుండా ఆ మేరకు అధికారులను ఆదేశాలివ్వకుండా తూతూ మంత్రంగా సమావేశాన్ని నిర్వహించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సమావేశంలో జెడ్పీటీసీ అమాస కుసుమ మోహన్, డిటి శ్యాం ప్రసాద్ రెడ్డి, ఈఓఆర్‌డి లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు తీర్చండి.. పెండింగ్ బిల్లులివ్వండి

▶▶ సర్వసభ్య సమావేశంలో సర్పంచ్‌లు

ప్రజాశక్తి-సదుం: గ్రామాల్లో నెలకొని ఉన్న నీటి సమస్యలు పరిష్కరించాలని ఊటుపల్లి సర్పంచ్ చల్లా శ్రీనివాసులు రెడ్డి మండల సర్వసభ్య సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. చల్లావారిపల్లిలో నీటి సమస్య ఉందని, తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం ఎంపీపీ యల్లప్ప అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ప్రజాప్రతినిధిలు, అధికారులు హాజరైయ్యారు. సర్పంచ్‌లు పలు సమస్యలను అధికారులకు వివరించారు. రెడ్డివారిపల్లి సర్పంచ్ మాట్లాడుతూ ఇప్పటి వరకూ పంచాయతీలో స్వంత నిధులతో ఖర్చులు చేశామని, ఆ పనులకు సంబంధించి పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని కోరారు. ఖరీఫ్ సీజన్‌కు గాను మండలానికి వేరుశెనగ కాయలు వచ్చాయిని వ్యవసాయ అధికారి హరి ప్రసాద్ తెలిపారు. బి.సి.జి టీకాలు మండలానికి ఇచ్చిన టార్గెట్ 720గాను 800మందికి టీకాలు వేసే కార్యక్రమం పూర్తి చేసామని ఆరోగ్య విస్తరణ అధికారి ఉదయ్ భాస్కర్ తెలిపారు. అంగన్వాడీ కేంద్రాలకు కేటాయించిన రేషన్ బియ్యం, రేషన్ డీలర్లు కొంతమంది అంగన్వాడీ కేంద్రాలకు ఆలస్యంగా సరఫరా చేస్తున్నాని అంగన్వాడీ సూపర్ వైజర్ మళ్ళీశ్వరి అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఏనుగులు మండల పరిధిలోని కొన్ని గ్రామాలలో రైతులు వేసుకొన్న పంటలను తీవ్రంగా నష్టం చేశాయని, రైతులను ఆదుకోవడానికి ప్రభుత్వం అందజేసే పంట నష్ట పరిహారంను ఎన్నికల కోడ్ తరువాత రైతులకు అందజేసే కార్యక్రమం అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకొంటున్నారని ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ మహేష్ తెలిపారు. చీకలచేను మార్గంలో ఆర్‌టిసి బస్సు సర్వీస్‌కు చర్యలు చేపట్టాలని బూరగమంద ఎంపిటిసి మల్లికార్జున డిమాండ్ చేశారు. తిమ్మానాయునిపల్లి మార్గంలో ఆర్‌టిసి బస్సు సర్వీస్ కావాలని గత 6నెలలుగా అధికారులను ప్రాధేయ పడుతున్నా సమస్య పరిష్కారం కాలేదని సర్పంచి లోకనాథ రెడ్డి సమావేశంలో వాపోయారు. ప్రభుత్వ ఎస్సీ సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహం ఇప్పుడున్న పాత బిల్డింగ్‌లో వసతులు సరిపోనందున 50మంది విద్యార్థులకు మించి కొత్త అడ్మిషన్స్ తీసుకోలేక పోతున్నామని ఆయన సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. కొత్త బిల్డింగ్ నిర్మాణంకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వసతి గృహం సంక్షేమ అధికారి డిఎం.షరీఫ్ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజశేఖర్ బాబు, తహశీల్దార్ టి.నారాయణ స్వామి, ఎంఈవో శ్రీరాములు, వ్యవసాయ అధికారి హరి ప్రసాద్, అన్ని శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడండి

▶▶ ఎంపీపీ లతబాలాజీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

ప్రజాశక్తి-కార్వేటినగరం: గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులపై ఉందని ఎంపీపీ లతబాలాజీ అన్నారు. జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు సాధారణ సర్వసభ్య సమావేశాన్ని వెలుగు కార్యాలయం సమావేశ భవనంలో శుక్రవారం ఎంపీడీవో మోహనమురళీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ తాగునీటి సమస్యలున్న గ్రామాలను విధిగా గుర్తించి పరిష్కరించాల్సిన బాధ్యత కార్యదర్శులు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులపై ఉందన్నారు. కార్యాలయానికే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పర్యటించి గ్రామాల్లో మౌళిక వసతులు కల్పించాలని సూచించారు. అనంతరం ఎంపీడీవో మోహన్ మురళీ మాట్లాడుతూ ఎన్నికల నిబంధనల ప్రకారం కొత్త విధాన నిర్ణయాలు, ప్రకటనలు, తీర్మానాలు చేయకూడదన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులను నూతన పనులకు వెచ్చించకుండా, గ్రామాల్లో అవసరమైన తాగునీటి మోటార్ల మర్మత్తులు, పైప్ లైన్లు, ట్యాంకుల మర్మత్తులకు మాత్రమే వినియోగించాలని ఆదేశించారు. ఈ క్రమంలో భాగంగా కొటార్వేడు పంచాయతీలో తాగునీటి సమస్య ఉందని ఆ సెగ్మెంట్ ఎంపీటీసీ విమల అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. అదే విధంగా పద్మసర్సు ఎస్సీ కానీలో కూడా తాగునీటి సమస్యలతో పాటు విద్యుత్ సమస్య ఉందని, అధికారులు స్పందించి వెంటనే సమస్యను పరిష్కరించాలని ఎంపీటీసీ కమ్మలమ్మ అధికారులకు విన్నవించారు. దీంతో స్పందించి ఎంపీడీవో ఆయా పంచాయతీ కార్యదర్శులు గ్రామాలను సందర్శించి సమస్యను పరిష్కరించి వెంటనే తమకు నివేధిక అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ లక్ష్మీపతి, ఎంఈవో విజయకుమార్, డిప్యూటీ తహసీల్దార్ నీలావతి, ఎఈలు ప్రకాష్, గిరీషం, హేమాద్రి, ఏవో హేమలత, మండల కోఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్రెడ్డి, వైస్ ఎంపీపీ మణెమ్మ, సింగిల్విండో అధ్యక్షుడు లోకనాథరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్లు పలువురు పాల్గొన్నారు.